క్లుప్తంగా

నేడు హౌసింగ్ బోర్డు కాలనీ రెసిడెంట్స్ సమావేశం

కాచిగూడ: బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు కాలనీ రెసిడెంట్స్ సమావేశం ఈనెల 23న ఉదయం 9:30 గంటలకు కాలనీ పార్కులో జరగనుంది. బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు ఎల్ఐజీహెచ్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వివేక్ ఆనంద్, పొడిశెట్టి కిషోర్, ఎన్.శరత్‌శ్యామ్ తెలిపారు. కాలనీలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, సమస్యలపై చర్చిస్తారని రెసిడెంట్స్ అందరూ పాల్గొనాలని కోరారు. తమ సలహాలు సూచనలు చేస్తే సమావేశంలో పలు అంశాలపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

'పిల్లల బొమ్మల పుస్తకాలు' ఆవిష్కరణ



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తానా, మంచి పుస్తకం సంస్థలు ముద్రించిన 'పిల్లల బొమ్మలు' పుస్తకాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శనివారం సభకు అధ్యక్షత వహించిన ఎం.వీ.ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ ఆర్.వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పిల్లల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఈ పుస్తకాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఇలాంటి కృషి చేసిన తానా, మంచి పుస్తకం సంస్థల కృషి అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధులు భాగ్యలక్ష్మి, ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, రచయిత జి.మహేశ్వరి, కె.నాగశిల్ప, కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలి

ముషీరాబాద్: గురుకుల పాఠశాలల్లో అదనపు సెక్షన్‌లు ఏర్పాటు చేసి దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు ఇవ్వాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ అన్నారు. శనివారం విద్యానగర్ చౌరస్తాలో ఆందోళన చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ఎన్నో పోరాటాలు చేయడంతో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసిందన్నారు. మెరిట్ ఆధారంగా సీట్లు కేటాయించడంతో పేద విద్యార్థులు సీట్లు సాధించలేకపోతున్నారన్నారు. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి ప్రొఫెషనల్ కోర్సులకు మెరిట్ ఉంటుందని 5వ తరగతి చదివే పిల్లలకు మెరిట్ ఉండటాన్ని ఆయన ప్రశ్నించారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీటు కేటాయించాలని వేముల డిమాండ్ చేశారు.

అధికారుల తీరుపై కార్పొరేటర్ ఆగ్రహం



అరుంధతినగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీతో పాటు ఇతర నాలా పరివాహక ప్రాంతాల్లో నీటిపారుదల విభాగం అధికారుల తీరుపై డివిజన్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం డివిజన్‌లోని నాలా పరివాహక ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. నాలాల వెంట మట్టికుప్పలు తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కార్పొరేటర్‌గా తాను గతంలో చేసిన విజ్ఞప్తిని సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం సిగ్గు చేటన్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ గాంధీనగర్ డివిజన్‌లో పర్యటించినా స్థానిక అధికారులు తమకు సమాచారం ఇవ్వలేదన్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారుల పర్యటనపై సమాచారం ఇవ్వడంలో ప్రోటోకాల్‌ను పాటించడంలేదని వాపోయారు. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. మున్సిపల్ ఇరిగేషన్ విభాగం ఏఈ శ్యామ్‌సుందర్, డిప్యూటీ ఈఈ జగదీష్, బీజేవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రత్నసాయిచంద్, ఉమేష్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, సాయి, సురేందర్, దోనేటి సత్యం, సంధ్య, ముత్యాలు, అభిషేక్‌లు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ శాంతి యువజన సంఘం బస్తీలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయాలని సంఘం సభ్యులు సాయి, ఎన్.పెంటయ్య, ఎస్.రాజు, వేణుగోపాల్, శివకుమార్, జె.బాబురావులు శనివారం మధ్యాహ్నం బస్తీలో మాట్లాడారు. బస్తీలో ఉన్న ఖాళీ స్థలంలో బస్తీ దవాఖానాను ఏర్పాటు చేయడం ద్వారా బస్తీ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. గతంలోనే ఇక్కడ బస్తీ దవాఖానా ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చారని వివరించారు. దవాఖానాను త్వరలోనే ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

మంచి ఆలోచనలే విజయానికి సోపానాలు

హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.లక్ష్మణ్



విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, మెరిట్ అవార్డులను అందజేసిన హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.లక్ష్మణ్

కాచిగూడ: ఆత్మవిశ్వాసంతో కూడిన మంచి ఆలోచనలే విజయానికి సోపానాలుగా నిలుస్తాయని హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.లక్ష్మణ్ అన్నారు. మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు ఆధ్వర్యంలో శనివారం కాచిగూడలో ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు అధ్యక్షతన పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, మెరిట్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జస్టిస్ ఎం.లక్ష్మణ్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు అవార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలోనే సమయాన్ని సద్వినియోగం చేసుకుని ఎదురయ్యే అవరోధాలను అధిగమించి విజయాలు సాధించేందుకు సన్నద్ధం కావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలన్నారు.

- అనేక రంగాల్లో అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు, సౌత్ సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ వై.అభిలాష్, మాజీ ఎంపీ వీ.హనుమంతరావు, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం మేనేజింగ్ ట్రస్టీ అకుల పాండురంగారావు, ట్రస్టీలు రాఘవేందర్, పిల్లి శ్రీనివాస్‌రావు, సూర్యప్రకాష్, నిమ్మ శంకర్ తదితరులున్నారు.

ఆత్మరక్షణకు ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలి..



విద్యార్థిని అభినందిస్తున్న తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు

కాచిగూడ: ఆత్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కరాటే నేర్చుకోవాలని ముఖ్యంగా బాలికలు నేర్చుకోవడానికి ముందుకు రావాలని తెలంగాణ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ వెంకట రాములు అన్నారు. ఇటీవల గోవాలో జరిగిన 3వ ఏషియన్ ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్ షిప్ – 2023 పోటీల్లో కరాటే విద్యార్థిని మయూరి పాల్గొని పసిడి పతకంతో పాటు బాలికల విభాగంలో గ్రాండ్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. శనివారం కాచిగూడలోని మున్నూరుకాపు భవన్, మ్యాడం అంజయ్యహాల్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సీవీ రాములు, హైకోర్టు జడ్జి జస్టిస్ ఎం.లక్ష్మణ్ మయూరిని అభినందించి ఘనంగా సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. బాలబాలికలు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని వారు సూచించారు. ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు, పిల్లి శ్రీనివాస్‌రావు, రాఘవేందర్, వై.అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

కవాడిగూడ: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షానికి నగరంలో ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ అశోక్‌నగర్ నుంచి కవాడిగూడ డివిజన్ నాలా ప్రహరీ పనులను వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యవేక్షిస్తున్నామన్నారు. శనివారం హుస్సేన్ సాగర్ నీటి మట్టం, నాలా పరిసర ప్రాంతాలను మంత్రి జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, అధికారులతో కలిసి పరిశీలించారు. చాలా ప్రాంతంల్లో ఇబ్బందులు తప్పాయన్నారు. నాలాల పక్కన అక్రమ నిర్మాణాలతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని అక్రమ నిర్మాణాలపై త్వరలో ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. అవసరమైతే వారికి నష్టపరిహారం చెల్లిస్తామన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా వెంటనే జీహెచ్ఎంసీ కంట్రోల్‌రూమ్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. వర్షాల కారణంగా ఎవరూ ఇబ్బందులు పడొద్దని, ప్రభుత్వం ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు చేపడుతోందన్నారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, జీహెచ్ఎంసీ ఈఈ శ్రీనివాస్, స్టీల్ బ్రిడ్జి ఈఈ గోపాల్, డీఎంసీ తిప్పర్తి యాదయ్య, ఏఎంఓహెచ్ మైత్రి, జీహెచ్ఎంసీ డీఈ సన్నీ, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ, స్థానిక డివిజన్ ప్రెసిడెంట్ వల్లాల శ్యామ్ యాదవ్, గాంధీనగర్ డివిజన్ ప్రెసిడెంట్ రాకేష్‌కుమార్, సీనియర్ నాయకులు ముఠా నరేష్, కార్యదర్శులు సాయికృష్ణ, పొత్తుల శ్రీకాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలా పనుల పరిశీలన

చిక్కడపల్లి: గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు హుస్సేన్‌సాగర్ నాలా పరిస్థితిని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఇరిగేషన్ అధికారులు శనివారం అశోక్‌నగర్ నాలాను పరిశీలించారు. అశోక్‌నగర్ బ్రిడ్జిని ఇటీవల విస్తరించిన నేపథ్యంలో వరదనీరు సాఫీగా వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ నేతలు జైసింహ, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



బతుకమ్మకుంటలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు చొరవ తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. శనివారం బాగ్అంబర్‌పేట డివిజన్ బతుకమ్మ కుంటలో ప్రజా సమస్యలపై పాదయాత్ర చేశారు. వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీధిలైట్లు, పారిశుద్ధ్యం తదితర సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

డ్రైనేజీ సమస్య..

అంబర్‌పేట: వర్షాలతో పొంగుతున్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బాగ్అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. శనివారం డ్రైనేజీ సమస్యలపై ప్రజల నుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో ఆమె ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. డ్రైనేజీ సమస్యతో వ్యాధులు ప్రబలే ఆవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జలమండలి డీజీఎం విష్ణువర్ధన్‌రావు ఇతర సిబ్బంది, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.27వేలు చెల్లించాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్రంలో పనిచేస్తున్న స్కూల్ స్వీపర్లకు కనీస వేతనం రూ.27 వేలు చెల్లించాలని ప్రొఫెసర్ హరగోపాల్ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ స్కూల్ స్వీపర్ల సంఘం, తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ×తెలంగాణ దశాబ్ద ఉద్యమాలు–స్వీపర్ల కష్టాలు, కన్నీళ్లు× అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. అనేక ఏళ్లుగా పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లకు అతి తక్కువ వేతనాలు చెల్లించడం వల్ల వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. స్వీపర్లను వెంటనే రెగ్యులర్ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.15 లక్షలతో పాటు పెన్షన్ రూ.10,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రొఫెసర్ జి.లక్ష్మణ్, సత్యనారాయణగుప్తా, ప్రముఖ విద్యావేత్త రవిచందర్, ప్రజాగాయని విమలక్క తదితరులున్నారు.

దుకాణ యజమానిపై దాడి

అంబర్‌పేట: దుకాణంలో పనిచేస్తున్న యువకుడిని తొలగించడంతో ఆగ్రహించిన కొందరు దుండగులు దుకాణం యజమానిపై దాడిచేయగా.. మరి కొందరు ఎదురు దాడికి పాల్పడిన ఘటన శనివారం అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని చెదరగొట్టారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

ముగిసిన చిత్తరంజన్ అంత్యక్రియలు

కాచిగూడ: ఆంధ్ర బాలానందం అధ్యక్షుడు శ్రీ మహాభాష్యం చిత్తరంజన్‌కు నారాయణగూడలోని బాలానందం కార్యదర్శి జేవీ కామేశ్వరి, ప్రతినిధులు స్వర్ణబాల, లావణ్య, తంగా కృష్ణమోహన్, హరిణి, బాలానందం కార్యవర్గ సమితి, ట్రస్టీ సభ్యులు ఘనంగా నివాళులర్పించారు. సంగీత నాటక అవార్డు గ్రహీత ఇకలేరనే వార్త అత్యంత బాధాకరమని పలువురు ప్రముఖులు, అభిమానులు అభిప్రాయపడ్డారు. చిత్తరంజన్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. తార్నాకలోని హిందూ శ్మశాన వాటికలో శనివారం ఆయన అంత్యక్రియలు ముగిశాయి. ఆయనను కడసారి చూసేందుకు వచ్చిన ప్రముఖులు చివరగా కన్నీటి వీడ్కోలు పలికారు.

భారత్‌లోనే నిరుద్యోగం తక్కువ

కేంద్ర సహాయ మంత్రి భగవంత్ కూబా



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ దేశాలతో పోలిస్తే భారత్‌లోనే నిరుద్యోగం తక్కువగా ఉందని మనదేశంలో నిరుద్యోగం 30 శాతమే ఉందని కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ సహాయ మంత్రి భగవంత్‌కూబా అన్నారు. శనివారం ఆర్టీసీ కల్యాణ మండపంలో 'సెంట్రల్ బోర్డు ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్, కస్టమ్స్' ఆధ్వర్యంలో నిర్వహించిన రోజ్‌ఘర్ మేళాలో సుమారు 135 మంది యువతకు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఎయిమ్స్, పవర్ గ్రిడ్, కేంద్ర పరోక్ష పన్నుల బోర్డు, బ్యాంక్ ఆఫ్ బరోడా లాంటి ప్రభుత్వ ఉద్యోగాల తెలుగు రాష్ట్రాలకు చెందిన యువతకు నియామక పత్రాలను అందజేశారు. భారత్ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని కేంద్రం అత్యంత పారదర్శకంగా అమలు చేస్తున్న విధానాల వల్ల నిరుద్యోగం గణనీయంగా తగ్గిందన్నారు. జీఎస్టీ హైదరాబాద్ జోన్ చీఫ్ కమిషనర్ సందీప్‌ప్రకాష్, జీఎస్టీ ముఖ్య కమిషనర్ వి.సంగీత తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ముందుండేది పోలీసులే



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

అంబర్‌పేట: పోలీసుల విధుల్లో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని అంశాల్లో అవగాహన పెంచేందుకు చొరవ తీసుకుంటున్నట్లు అంబర్‌పేట్ పోలీస్ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ పి.మధుకర్‌స్వామి తెలిపారు. ఆపదలో ఉన్న వారిని ప్రాథమికంగా రక్షించేది పోలీసులేనని పోలీసు సిబ్బందికి ప్రాథమిక చికిత్సలతో పాటు సీపీఆర్ ప్రక్రియపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. శనివారం అంబర్‌పేట, మేడ్చల్ పోలీస్ శిక్షణ కేంద్రాల్లో లయన్స్ క్లబ్ గ్రీన్‌లాండ్స్, ఉస్మానియా మెడికల్ కాలేజీ వైద్యులు, సిబ్బంది సంయుక్త సహకారంతో సీపీఆర్, రోడ్డు ప్రమాద బాధితులకు అందించాల్సిన ప్రాథమిక చికిత్సలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఏ పరిస్థితుల్లో బాధితులను కాపాడే పలు అంశాలను వైద్యులు వివరించారు. అడిషనల్ ఎస్పీ ఏ.శ్రీనివాసరావు, పోలీసు శిక్షణా కేంద్రం వైస్‌ప్రిన్సిపాల్ పిచ్చయ్య, డీఎస్పీలు జగన్, శ్రీధర్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ అనితా భల్లా, డాక్టర్ లక్ష్మీకుమారి, డాక్టర్ రాజ్‌కుమార్, లయన్ రఘునాథ్‌రెడ్డి, బండి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

చిక్కడపల్లి: అప్పుల బాధ తట్టుకోలేక ఓ డిగ్రీ విద్యార్థి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌ల సందర్భంగా బెట్టింగ్‌లో భారీ ఎత్తున పెట్టుబడి పెట్టి నష్టపోవడంతో ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. ఇన్‌స్పెక్టర్ ఎస్.సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ పల్నాడు జిల్లా రాముడిపాలెం గ్రామానికి చెందిన వి.సతీష్‌బాబు (20) విజయవాడ లయోలా కళాశాలలో డిగ్రీ విద్యార్థి. కాగా చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్ ఓ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా శనివారం రాత్రి 9గంటల సమయంలో సతీష్‌బాబు తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు అడ్మిన్, సెక్టర్ ఎస్సై నాగరాజు, అఖిలాష్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాయిచంద్ గొప్ప కళాకారుడు



నివాళులర్పిస్తున్న దేశపతి శ్రీనివాస్, రసమయి బాలకిషన్, విమలక్క

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణలో విశిష్ట గాయకుడు సాయిచంద్ అని మనస్సుకు తాకేలా పాటలను పాడి ప్రజలను నుంచి గొప్ప ఆదరణ పొందిన కళాకారుడని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సాయిచంద్ మిత్ర బృందం ఆధ్వర్యంలో సాయిచంద్ సాంస్కృతిక సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా సాయిచంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా అంటూ సాయిచంద్ పాడిన పాట మంచి ఆదరణ పొందిందని అది ఆయన తప్ప మరెవ్వరూ.. పాడలేరన్నారు'. 'రాయిని సైతం కరిగించగలిగే గాత్రం ఆయనలో ఉందన్నారు'. 'రాజకీయంగా ఉన్నత స్థానం పొందాలనే కోరిక ఉండేదని తాను సజీవుడిగా ఉంటే ఆ కోరిక నెరవేరేదని' వాపోయారు. ప్రముఖ రచయిత, గాయకుడు జయరాజు మాట్లాడుతూ.. బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచన విధానాలను ముందుకు తీసుకుపోవడంలో సాయిచంద్ కీలక పాత్ర పోషించారని తెలిపారు. ప్రముఖ వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, ప్రముఖ కవి, గాయకుడు యశ్పాల్, ప్రజా గాయని విమలక్క, సాయిచంద్ తండ్రి వెంకటరాములు, గంధం రాములు, రమేష్, సత్య, గంగా, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాలా ప్రహరీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి



స్థానికులతో కార్పొరేటర్ జి.రచనశ్రీ

కవాడిగూడ: హుస్సేన్‌సాగర్ నాలాకు ఇరువైపులా నిర్మించే ప్రహరీని త్వరితగతిన పూర్తి చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అధికారులను కోరారు. నాలా ప్రహరీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో హుస్సేన్‌సాగర్ నాలా పరివాహక ప్రాంతంలో నివసించే న్యూ అంబేడ్కర్‌నగర్ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నాలా ప్రహరీ నిర్మాణం కోసం న్యూ అంబేడ్కర్‌నగర్‌లో ఇంటి గోడలను తొలగించగా.. పనులు పూర్తి కాకపోవడంతో ప్రమాదం అంచున బస్తీ వాసులు జీవనం సాగిస్తున్నారన్నారు. శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆమె పర్యటించారు. బస్తీ అధ్యక్షుడు పీ.ఎస్.చారి, మున్సిపల్ అధికారులు శ్యామ్, వాటర్‌వర్క్స్ సిబ్బంది, బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సీ.మహేందర్‌బాబు, ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బస్తీ కమిటీ అధ్యక్షుడు, ఓబీసీ మోర్చా రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు పాములపర్తి నర్సింహచారి, బీజేపీ నేతలు సలంద్రి దిలీప్‌యాదవ్, కుమార్‌గౌడ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల కొమ్మలు తొలగించండి



కాచిగూడ: విద్యుత్ సరఫరాకు ప్రమాదకరంగా మారిన చెట్ల కొమ్మలను తొలగించాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ జీహెచ్ఎంసీ హార్టికల్చర్ అధికారులను కోరారు. శనివారం కార్పొరేటర్ కార్యాలయంలో హార్టికల్చర్ అధికారులతో సమావేశమైన ఆమె పలు సూచనలు చేశారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రోడ్లపై ఉన్న చెట్ల కొమ్మలు వేలాడుతున్నాయని వాటిని తొలగించాలన్నారు. హార్టికల్చర్ అధికారులు ఫయాజ్, గ్రేసీ, బీజేపీనేతలు రమేష్‌యాదవ్, బీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలి

మణిపూర్‌లో జరుగుతున్న హింసపై నిరసనలు



గోల్కొండ క్రాస్ రోడ్డు నుంచి సీపీఎం ఆధ్వర్యంలో..

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఆపి శాంతిని నెలకొల్పాలని సీపీఐ(ఎంఎల్) రామచంద్రన్ పార్టీ అధికార ప్రతినిధి బుద్ధా సత్యనారాయణ అన్నారు.

- మణిపూర్‌లో జరిగిన మారణహోమానికి బాధ్యత వహిస్తూ.. ప్రధాని రాజీనామా చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్‌నాయక్ డిమాండ్ చేశారు. మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ సామూహిక అత్యాచారానికి పాల్పడుతూ దేశం సిగ్గుతో తలదించుకునే విధంగా వ్యవహరించిన దుండగులపై చర్యలు తీసుకోవడంలో విఫలం చెందారని ఆరోపించారు. ప్రజా గాయని విమలక్క, వివిధ సంఘాల నాయకులు ధర్నానాయక్, సచిన్, బండ రవికుమార్, భూపతి వెంకటేశ్వర్లు, ఆనందచారి తదితరులున్నారు.

కవాడిగూడ: మణిపూర్ గిరిజన మహిళలకు ప్రమాదకరంగా మారిందని ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ ఆరోపించారు. మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన సామూహిక అత్యాచారం దీనికి నిదర్శనమన్నారు. ఆప్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు శోభన్ బుక్యా, సోలోమన్‌రాజు, నేతలు రాకేష్‌సింగ్, ఆపసాబేగం, మల్లేష్, ఆప్ యూత్ వింగ్ అధ్యక్షుడు సర్దార్ రణదీర్‌సింగ్‌రాణా తదితరులు పాల్గొన్నారు.

ముషీరాబాద్: సీపీఎం ఆధ్వర్యంలో గోల్కొండ క్రాస్ రోడ్డు నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్డు వరకు మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లను నిరసిస్తూ నిరసన ప్రదర్శన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు జ్యోతి, పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జి.నర్సింహ్మారావు, నగర కార్యదర్శి శ్రీనివాస్‌లతో పాటు పలువురు మాట్లాడారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు కె.నాగలక్ష్మి, ఎం.దశరథ్, ఎం.శ్రీనివాసరావు, కె.ఎస్.రాజన్న, ఎం.మహేందర్, ఎం.వెంకటేష్, ఎస్.మారన్న, ఆర్.వెంకటేష్, కుమారస్వామి, ఆర్.వాణి తదితరులు పాల్గొన్నారు.

- మణిపూర్‌లో మహిళలపై ఆకృత్యాలకు, అత్యాచారాలకు పాల్పడిన దోషులను కఠినంగా శిక్షించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ అధ్యక్ష, కార్యదర్శులు పద్మ, నాగలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ముషీరాబాద్‌లో ఐద్వా కమిటీ ఆధ్వర్యంలో మణిపూర్ ఘటనకు నిరసనగా ధర్నా చేశారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకు నేరస్తులను అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఐద్వా నగర నాయకులు షబానా, విమల, ప్రవళిక, వరలక్ష్మి, మణమ్మ తదితరులు పాల్గొన్నారు.
- మణిపూర్‌లో ఆదివాసీ మహిళలపై లైంగిక దాడులకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.పరశురాం ఆరోపించారు. ఈ ఘటనకు ప్రధాని బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

నల్లకుంట: మణిపూర్‌లో జరుగుతున్న ఘటనలకు బాధ్యత వహిస్తూ ఆ రాష్ట్ర ముఖ్య మంత్రి రాజీనామా చేయాలని సీపీఎం కార్యదర్శి వర్గ సభ్యుడు మహేందర్ డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మణిపూర్ ఘటనను సుమోటాగా తీసుకుంటామని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించడం అక్కడి ప్రభుత్వ అసమర్థ పాలనకు నిదర్శనమని విమర్శించారు. ఒక గిరిజన మహిళా రాష్ట్రపతి ఈ ఘటనపై స్పందించకపోవడం ఆవేదన కలిగిస్తోందన్నారు. ఈ ఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి స్పందిస్తే తన పదవులు ఎక్కడ పోతాయోననే భయంతోనే మౌనంగా ఉన్నారని ఆరోపించారు. సీపీఎం నాయకులు రాములు, మోహన్, షబానా, వరలక్ష్మి, నాగేందర్, జనార్దన్, సాంబ పాల్గొన్నారు.

ఈనెల 25న నిరసన చేపట్టాలి..

చిక్కడపల్లి: మణిపూర్‌లో జరిగిన సంఘటనకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 25న నిరసనలు చేపట్టాలని నిర్ణయించామని తెలంగాణ రైతుసంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు టి.సాగర్, పాలడుగు భాస్కర్, వెంకట్రాములు ప్రకటించారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం మాట్లాడుతూ.. నెలలతరబడి మౌనం పాటిస్తూ వచ్చిన ప్రధాని చివరకు చేసిన ప్రకటన సరికాదన్నారు. 25న చేపట్టే నిరసనలో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.